తెలుగు కళాసమితి(న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో రు.100/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

# అంటు

చల్లనివేళ. సూర్యకాంతి ఏటవాలుగా మొక్కలపైన పడుతుంటే లేత లేత కిరణాలు తాకి మరింత అందంగా కనిపిస్తున్నాయి పువ్వులు.

అబ్బా! ఎంత చక్కని గులాబీలు. ఎర్రగా అగ్గిచేయంత పూలు. ఒక్క ఎరుపే కాదు. రకరకాల రంగుల గులాబీలు గుబురుగా విరబూస్తున్నాయి. కొన్ని వాడిపోయున్నాయి, వాడిపోయినవి రాలిపోయి కూడా వున్నాయా తోటలో.

రాలిన పూలు రోజూ తుడుస్తూ ఏరుతుంటుంది రాజి. ఏరిన రేకలు మొక్కల మొదట్లో వేయమంటుంది నీలవేణమ్మ.

రాజికి రాలిన పూలు ఏరుతున్నపుడు వుసూరుమంటుంది. ఇంతవరకు గులాబి పెట్టుకునే అదృష్టం దొరకనందుకు బాధపడుతూ వుంటుంది.

నీలవేణమ్మగారి తోటలో పని చేస్తున్నప్పుడల్లా తన గుడిసె, గుడిసెముందున్న మూడడుగుల జాగాలోని మొక్కలు గుర్తుకొస్తాయి.

''అంత ఎత్తుకి నీళ్ళు మొయ్య లేవమ్మా'' అంటే...

''నాను కదా మోస్తాను నీకేనికి'' అంది.

''రిక్షా ఇంత మెరక్కి రోజూ తేలేనమ్మా'' అంటే...

''ఎక్కడో ఒక్కాడ కిందన యెట్టుకోవచ్చయ్యా'' అంది.

తండ్రి ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఎన్ని కష్టాలకైనా ఓర్చుకుంటానంది. ఇంతకంటే మంచి గుడిసె దొరికినప్పుడు మారిపోదుముగాని, ఇప్పుడు మాత్రం ఇక్కడే వుందుమంది. మెట్టకి ఎగువమున్న గుడిసెలో దిగి నాలుగు సంవత్సరాలైంది.

ఆ మెట్ట పట్నానికి మధ్యలో వుంది. రాజి గుడిసెకు వెళ్ళాలంటే క్రిందనున్న గుడిసెలన్నీ దాటుకొని మెట్ట పైకెళ్ళాలి. పైకెక్కి చూస్తే చుట్టూరా మేడలే కనిపిస్తాయి. మేడల పైనుండి చూసేవాళ్ళకి అక్కడ గుడిసెలన్నీ చంద్రునిలో మచ్చల్లా కనిపిస్తాయి.

రాజి గుడిసె మాత్రం ఆ గుడిసెల్లో చంద్రునిలా వుంటుంది. గుడిసె ముందున్న మూడడుగుల జాగాలో బంతి, చేమంతి, డిసెంబరులు, క్రోటన్సు మొక్కలు పెంచింది. మొక్కలకీ గుడిసెకీ కలిపి కప్పినట్టు 'దడి' కట్టింది. పర్ణశాలలా చక్కగా, శుభ్రంగా, అందంగా వుంటుంది గుడిసె.

రాజికూడా అలాగే చక్కగా, శుభ్రంగా, అందంగా వుంటుంది. అంత పొడవూకాక, లావూలేక మామూలుగా వుంటుంది. ఎప్పుడూ జడ వేసుకోదు. సిగ ముడుచుకుంటుంది. సిగలో ఏదో ఓ రకం పువ్వు ప్రతి రోజూ పెడుతుంది. పువ్వు దొరకనప్పుడు ఏదేనా క్రోటన్సు ఆకైనా తురుముకుంటుంది.

పూవో, ఆకో సిగలో లేనిరోజు ఏదో వెలితిగా అనిపిస్తుందామెకు. ఆ అలవాటువల్లే పూల మొక్కలు పెంచింది. కాని అన్ని కాలాల్లో పూసే మొక్కలు దొరకలేదు. రాజికి అన్ని కాలాల్లో పూసే మొక్కలు కావాలి. అందులోనూ గులాబి మొక్కలంటే మహా ఇష్టం. సిగలో గులాబి పెట్టుకోవాలని ఎప్పటి మంచో కోరిక. చిన్నప్పటి నుండీ ప్రీతి.

''అయ్యా అల్లా పువ్వు'' అని బజారులో గులాబి చూపిస్తే ''దినం జరక్క సస్తుంటే నీకు పోకులు కావాలమ్మా'' అని తండ్రి విదలించా డోరోజు. అది లగాయతు గుల్బాబి గగనమైపోయింది రాజికి.

ఎవర్నడిగినా వాళ్ళ దగ్గరున్న బంగారం అడుగుతున్నట్టుగా బాధపడిపోతారు. 'నీ కెందుకే గులాబి పువ్వు' అని హేళనగా నవ్వుతారు.

'తన లాటోలు గులాబి యెట్టుకోకూడదా!? గులాబి అన్ని పువ్వుల్లాంటి పువ్వు కాదా? ఇది గొప్పోల ఇంట్లోనే వుంటుందా? గుడిసెల్లో గులాబీలు పూయవా?' అని అనుకొని బాధపడుతూ వుంటుంది.

వాకిట్లో గులాబి మొక్కలు చూసేకనే నీలవేణమ్మ గారి ఇంట్లో పనిలో కుదిరింది. కుదిరి ఆరు మాసాలయింది. ఐదు మాసాలై గులాబి అంటు అడుగుతూనే వుంది.

రాలిన పూవు కూడా పైకి పోనివ్వని నీలవేణమ్మ ఈవేళ రేపూ, రేపు ఎల్లుండీ చేసుకుంటూ వచ్చింది. అడగ్గా అడగ్గా 'రేపిస్తానంది'.

రాజి ఎగిరి గంతేసింది.

''అయ్యా! రేపు గులాబంటు నీలమ్మగోరిస్తామన్నారు'' అంది జీవితంలో ఒక పెద్ద కోరిక తీరిపోతున్నట్టు.

తండ్రి ఆ మాట ఏమీ పట్టించుకోలేదు. రిక్షా లాగి లాగి నీరసించిన శరీరం రాజి పెళ్ళి సమస్యను తలలో మోస్తూ మరింత కృంగిపోతుంది. రాజికి ఇవేవీ పట్టవు. నీలవేణమ్మ అంటు ఇస్తుందని మహా ఆనందం.

జరగబోయే శుభం గురించి చెప్పినట్టు ఈ వార్త గొప్పగా చెప్పేసింది ఈ పొరుక్కి, ఆ పొరుక్కి.

''అనె రాజి.. పూలంతే నీకేటే ఇంత్రెరి'' అని పొరిగింటావిడంటే...

''యెర్రేటేది! నివ్వు రోజూ సుట్ట తాగవా నామా అలాగె సిగలో పువ్వెడతాను. నివ్వు రోజూ 'పకోడీ



తినవా నామా అలాగె మొక్కలకి నీలుపోసి పెంచుకుంతాను'' అంది.

మనిషికి రకరకాల కోరికలుంటాయి. రాజికి చిన్నప్పటి నుంచీ ఇదో కోరిక. ఆకలి, నిద్రకంటే అంటు మొక్కలు పెంచటం రాజికి ముఖ్యమయింది.

అంటుకోసం ఓ పగిలిపోయిన గోలెం ఎవరినో అడిగి సంపాదించింది. పగిలిన ముక్కల్ని ఓ తాడుతో దగ్గరగా కట్టి దానిలో మట్టిపోసి రడీగా వుంచింది.

రాత్రి నిద్రైనా పోయిందో లేదో తెల్లారి పనిలో కెల్తానే అంటుకోసం నీలవేణమ్మను అడిగింది. ''అబ్బా! చంపుతున్నావె రాజి. అదిగో అక్కడుంచాను వెళ్ళినపుడు తీసుకెళ్ళు''అని...చూపించింది నీలవేణమ్మ.

అంటును తెరిపారా చూసింది రాజి.

''ఎండిపోయిందమ్మగోరు'' అంది

# బొడ్డు కూర్మారావు



''మరేం బాధలేదు లేవె- బాగానే బతుకుతుంది. ఒకవేళ బతక్కపోతే అప్పుడు కొత్త అంటు కట్టిస్తాలె'' అంది నీలవేణమ్మ.

''అమ్మో! ఎలగా ఇస్తన్నారు. ఇల్లీ అంటు బాగున్నాది ఇయ్యండమ్మ'' అంది. ప్రక్కనున్న మంచి అంటును చూపించి.

''అంటు సంగతి నీకేమి తెలుసునె. ఇవి ఇలాంటి అలాంటి అంట్లనుకున్నావా! హైబ్రీడ్ అంట్లు. బెంగుళూరు నుండి తెప్పించినవి. ఒకొక్కటే యాభై చేస్తాయి. అల్లాటప్పా అంట్లనుకున్నావు గావాల్ను మామూలు మొక్కలే ఇరవై, ముప్పై అవుతాయి. అసలు నీ ఇంటిముందు ఇలాంటి అంటు పెరగడమే పెద్ద విచిత్రం, ఇందులో మళ్ళీ మంచిదీ చెడ్డదీ కావాలా... తీసికెళ్తే తీసుకెళ్ళు లేకపోతే వుంచే. అంతేకాని ఎక్కువ ఆశకు పోకు'' అంది చిరుకోపంతో నీలవేణమ్మ.

''అలాగేనమ్మ'' అని ఎండిపోయిన అంటు కాండంపైన గోరుతో చిన్నగా నాటింది. పచ్చిగానే వుంది. ఫర్వాలేదు. బతికేస్తుందనుకొని సడలిన సంతోషాన్ని కూడగట్టుకొంది.

అంటు ఇంటికి తీసుకెళ్ళి గోలెంలో పాతింది.

ప్రతిరోజూ నీలవేణమ్మగారి ఇంటిదగ్గర పనులు ముగించి ఇక్కడ అంటుకి సపర్యలు చేసేది. ఆకలి, దప్పిక చూడకుండా ఎంత రాత్రయినాసరే ఆ మెట్ట క్రిందనున్న బోరింగుదగ్గర నీళ్ళు తెచ్చేది. వరిలో ఎండలో గుడిసెలన్నీ దాటుకొని మెట్టెక్కి నీళ్ళు పోసేది.

రోడ్డుపైన తిరిగి తిరిగి పేడ తెచ్చి మొక్క మొదట్లో వేసేది. ఇరుగుపొరుగు ఇళ్ళల్లో ఉల్లి తొక్కలు వేసి కన్నపిల్లకంటే ఎక్కువగా చూసుకునేది.

వారం తిరగ్గానే చిన్న చిన్న పచ్చటి మొటిమలు కాండంపైన రావటం చూసి 'అమ్మయ్య బతికింది' అని పెద్ద నిట్టూర్పు విడిచింది.

రాజి కళ్ళన్నీ అంటుమీదనే. అంటుగూర్చి ఎవరైనా ప్రశ్నిస్తే చాలు దాని పుట్టుపూర్వోత్తరాలు చెప్పేసేది గొప్పగా.

ఆ అంటు రాజికి ప్రాణమైపోయింది.


''అయ్యా రెండాకులొచ్చినావి చూడు'' అంది మొక్కని చూపించి మురిసిపోతూ.

''నీ కదే లోకమైపోయింది. అల్లా ఇల్లు సూడమన్నాను సూసినావా ఆరోడ్డోరది'' అన్నాడు విసుక్కున్న స్వరంతో.

''లేదయ్యా, అయినా ఇదే హైనాది. బాగున్నాది కదా!'' అంది.

''నీకు బాగున్నాది. మూడు పదులిచ్చుకొని నా పాపానికి సుఖం లేకండా వున్నాది. సూడు- ఆ గుడిసె కూడా బాగున్నాది. ముందల కసింత జాగాకూడా వున్నాది. ఆలిసిమైనా ఒకపాలి సూడు'' అన్నాడు.

''సూస్తాను గనయ్యా... ఈ మొక్కలన్నీ మళ్ళీ



మారసాల. గులాబంపైయితే గోలెంతోటి తీసికెళ్లి పోతానుగాని, ఈ మొక్కలన్నీ తియ్యడం కష్టమయ్యో" అంది.

"నీకేటి పిచ్చేటే ఇయన్నీ మనకి కూడెడతాయే" అన్నాడు కోపంగా.

రాజి ఏమీ అనకుండా వెళ్ళిపోయింది. రాజి మనసు తెలుసుకున్న తండ్రి దాని పిచ్చి ఎప్పుడు కుదురుతుందో నని బాధగా నవ్వుకున్నాడు.

రోజులు జరుగుతున్న కొద్దీ గులాబీ మొక్క కూడా పెరుగుతూవుంది. గులాబి మొక్కతోపాటు రాజి మనసుకూడా ఉల్లాసంగా వుంది.

మొక్క ఒకొక్క ఆకు తొడుగుతూ ఆకుపచ్చగా కనిపిస్తోంది. లేత లేత ఆకులు సూర్యరశ్మి పడుతుంటే చిన్న మెరుపు ఇచ్చి ఆకులో కూడా అందం కనిపిస్తుంది.

పదిహేను రోజులు దాటాయి.

మొక్క చివర ఓ మొగ్గ కనిపించింది. రాజి సంబర పడిపోయింది. నీలవేణమ్మతో మురిసిపోయి చెప్పింది మొక్క మొగ్గేసిందని.

రాజి ఆశ తీరబోతోంది. మొగ్గ పూవైపోతుంది. పూవు తలలో పెట్టుకుంటాను. పెట్టుకొని నీలవేణమ్మ గారింటి కెల్తాను. నా సిగలో పూవు చూసి ఏమంటుం దో ఆయమ్మ సూడాలి అనుకుంది.

మొగ్గ రోజురోజుకి పెరుగుతుంది. మొదట పూసిన పువ్వు దేవుడికివ్వాలని ఎవరో అన్నారు.

రాజి ఆశ ఒక్కసారి నీరుగారిపోయింది.

అలె. ఎలాగ? మొదటి పువ్వు నేను పెట్టుకోలేక పోతున్నానే అనుకుంది. పోన్లే- మొక్క బతికింది, ఎన్నైనా పూస్తుంది. మొదటిది దేవుడికిస్తాను. తరువాత ఎన్ని పూసినా నేనేకదా పెట్టుకుంటానని రాజీపడింది.

మరువటి రోజున పెద్ద మొగ్గ ప్రక్కన మరో మొగ్గ కనిపించింది. సంతోషం పట్టలేక అబ్బా! రెండో మొగ్గ-నాకొకటి, దేవుడికొకటి. బలె బాగుందనుకుంది.

మొగ్గలు పెరుగుతున్నాయి.

ఒక మొగ్గ రెక్కలు విప్పి రెండోది రెక్కలు విప్పతూ వుంది.

రెండూ ఒక్కసారే తీయాలి. రెండుకి రెండూ అర చేయంత పూలౌతాయి. ఎంత చక్కగా వున్నాయి. అక్కాచెల్లెల్లా—

కిరణాలు పూలమీద పడుతుంటే మరింత ఎర్రగా కనిపిస్తున్నాయి. నీరు పోసినపుడు మొక్కంతా తడిచేలా పోస్తుంది. పూవుపైన పడ్డ నీటి బిందువులు అక్క డక్కడ చెంకీ కొట్టినట్టు కనిపిస్తాయి. గాలికి అటూ, ఇటూ వూగుతుంటే ఏవో బాసలు చెప్పినట్టు కని పిస్తాయి. రాజి వాటిని చూసి పరవశిస్తూ 'బుజ్జిముండలు ఎంత బాగున్నాయి' అని తన చెక్కిళ్ళకు పూలు చేర్చి ముద్దాడుకొంటుంది.

శ్రమతోటి, ఎంతో మమకారంతోటి పెంచుకుం టోంది ఆ మొక్కని.

పూలు బాగా విచ్చుకున్నాయి. ఒకదానినొకటి ఒరుసుకుంటూ తలలూపుతున్నాయి.

మెట్టక్రిందనున్న బోరింగు దగ్గర జనం ఎక్కువగా వుంటారని తెల్లారకముందే నీళ్ళు తెచ్చేస్తుంది. ఆ రోజు మెట్టపైకి నీళ్ళ బిందె పట్టుకుని ఎక్కుతూ జారి పోయింది. మోచేయి మోకాలూ తెగి రక్తం చిమ్మింది. అయినా నీళ్ళు తీసుకెళ్ళటం మానలేదు. ఒక్కరోజు నీరు పొయ్యకపోతే ఎక్కడ వాడిపోతాయోనని భయం. బాధతోనే నీళ్ళు పోసింది.

నీళ్ళు పోస్తున్నపుడు ఇరుగుపొరుగువాళ్ళు గుమిగూడి ఏదో చర్చించుకుంటున్నారు. రాజి వాళ్ళని చూసిందేకాని 'ఏటి' అని ఎవరినీ అడుగలేదు. అడిగున్నా బాగున్ను- ఎప్పుడూ ఏదో గొడవలు వుం టూనే వుంటాయని తన పని తాను చేసుకొని వెళ్ళి పోయింది.

తండ్రి రిక్షా తీసుకొని వెళ్ళిపోయాడు. దడిగేటు దగ్గరగా లాక్కొని తనూ పని కెళ్ళిపోయింది.

సాయంకాలానికి రాజి తిరిగొచ్చింది. కళ్ళెదుట పడ్డ దృశ్యానికి స్థాణువైపోయింది. తన ఆశలన్నీ నేలకూలి పోయున్నాయి.

నేల నేలంతా కల్లాపు చల్లినట్టు పూల రెక్కలు ఎర్రగా పడున్నాయి. గోలెం పూర్తిగా పగిలిపోయి ముక్క ముక్కలై పోయింది. మిగిలిన మొక్కలన్నీ నేలమట్టమై పోయున్నాయి. దడి దడిగా లేదు. చాపలా నేలకు అంటు కుపోయింది. గుడిసెలోని సామానంతా చెల్లా చెదురుగా వున్నాయి.

గుడిసెవాసుల హాహాకారాలు మిన్నుమిట్టుతున్నాయి. గోలగోలగా వుందా ప్రాంతం.

మున్సిపాలిటీ ఆఫీసు కట్టడానికి గుడిసెలు ఖాళీ చేయించిన మున్సిపాలిటీవాళ్ళను తిట్టనోడు లేడు. ప్రతి మనిషి నిప్పులు కక్కుతున్నట్టు వున్నాడు. ఆ స్థలం నిప్పుల కుంపటిలా వుంది. గాలి వూదితే చాలు రాజుకునే స్థితి.

రాజి రక్తం కాళ్ళ నుండి పైకి తన్నింది. కళ్ళు చింతనిప్పలైనాయి. ఏడుపు, ఆవేశం, కోపం ఒక్కసారి పెల్లుబికాయి.

స్థాణువైన రాజి చలించిపోయింది. దుఃఖం దూసు కొచ్చింది. ఆక్రోశం గట్లు తెంచుకుంది. సిగ వూడి పోయి జుట్టు చెల్లాచెదురయింది. ఒక చేత్తో కన్నీరు తుడుచుకుంటూనే రుద్రకాళిలా మెరిసి...ంది.

"ఈల మంద మండిపోను... ఈల కుదురు కూలి పోను... ఈల కుడ్డ మస్సవ... నా మొక్కలు పీకేసినోళ్ళ చేతులు పడిపోను... నా కష్టం నాక్కాకుండా సేసినోళ్ల వోలు పడిపోను... నా ఆశలు సెరిపేసినోళ్లు కాటి కెళ్ళ...

నాను తిండికి సూడ్నేదు. నాను నా సుకానికి సూడ్నేదు. నా రగతం పోసి పెంచుకున్నాను. నా పేనం నాగ సూసుకున్నాను. నా వుసురు పోసుకున్నారు. నా వుసురు ఆలికి తగులుతాది... తగిలి తీర్తాది..." అంటూ రాజి శాపనార్థాలు పెడుతూ కేకలేస్తోంది.

రాజి గోడు గుడిసెల్లో గింగిరులు తిరుగుతోంది.

"ఏది శాసితం తల్లీ!... రారా... మనలాటి బతు కులు ఇంతేనమ్మా... ఏదీ మంది కాదే...మనంపుట్టిన వూరు మనది కానేదు... మన రెక్కల కష్టం మనది కాదు... మన బతుకులు మనవి కావు... ఏదీ మనదని నేదు తల్లీ... ఏదీ మంది కాదే..." అంటూ రెక్క పట్టు కొని సముదాయిస్తున్నాడు తండ్రి.

రాజి శపిస్తూనే ఏడుస్తూనే తండ్రితో నడిచింది. ●

